క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన రాత్లావత్ శివనాయక్ గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం తండాకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరసాగర్, చంద్రశేఖర్‌నాయక్, రాజీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, చంద్రూనాయక్, స్వామినాయక్, జానకిరామ్ నాయక్, శివనాయక్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సమస్యలపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ గోవింద్ రావు, ఏఈ చందన్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్, కె.వెంకటయ్య, ఎండీ ఖాజ పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఒక వ్యక్తికి డెంగీతో ఆ వ్యక్తి ఇంటి పరిసరాల్లోని వ్యక్తులకు రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యసిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమనశ్రీ, రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, శైలజ, సుమిత్ర పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

వీపనగండ్ల: కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేసినట్లు ఎంఈఓ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయూష్ డాక్టర్ శ్వేత, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, ఎస్‌ఓ అరుణ, ఏఎన్‌ఎం రామచంద్రమ్మ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు కబ్జా చేశాడని నోటీసులు

గోపాల్‌పేట: సెలవురోజు డంపింగ్ యార్డులో మట్టినింపడంతో విషయం తెలుసుకున్న ఎంపీడీఓ భవాని మట్టితో నింపిన వ్యక్తికి సోమవారం నోటీసు అందించారు. మండలంలోని లక్ష్మీతండాకు గతంలో సర్వేనంబరు 590లో రెవెన్యూ అధికారులు డంపింగ్ యార్డుకోసం పంచాయతీకి స్థలం కేటాయించారు. ఆగస్టు 24న పీట్యానాయక్ అనే వ్యక్తి డంపింగ్ యార్డును మట్టి కొట్టించి మూసివేశాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ భవాని సోమవారం పీట్యానాయక్‌కు నోటీసు అందించారు.

గణేష్ మండపాల వివరాలు నమోదుచేయాలి

కొత్తకోట రూరల్: గణేష్ మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నిర్వాహకులు నమోదు చేయాలని సీఐ రాంబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ఆయా గ్రామాలతో పాటు ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు.

ఎస్‌ఐ మొబైల్ హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు

చిన్నంబావి: సైబర్ నేరగాళ్లు ఎస్‌ఐలను సైతం వదలడం లేదు. చిన్నంబావి ఎస్‌ఐ జగన్మోహన్ మొబైల్ నెంబర్ 8712670618ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆయన వాట్సాప్‌ను హ్యాక్ చేసి రవాణా చలనా పేరుతో ఏపీకే ఫైల్ ద్వారా వాట్సాప్ గ్రూపులలో తన నెంబర్ ద్వారా సందేశాలను పంపుతున్నారని ఎవరు కూడా ఆ ఫైల్ ను ఓపెన్ చేయొద్దని సూచించారు. తన నెంబర్ ఉన్న గ్రూపులలో తనను రిమూవ్ చేయాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

వనపర్తి విద్యావిభాగం: మన పాఠశాల–మన ఆత్మగౌరవం బ్రోచర్‌ను ఆవిష్కరించి తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాజ్ సురేష్, తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వరప్రసాద్‌గౌడ్ ఆవిష్కరించారు.

బద్రొద్దీన్‌షావలి ఉర్సు

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ శివారులో బద్రొద్దీన్‌షావలి దర్గా ఉర్సు సోమవారం కనుల పండువగా జరిగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముతవల్లి బద్రొద్దీన్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం ఒకటే రోజు జరిగే ఈ ఉర్సుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

కలగానే..కల్వర్టులు

- గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అంకూరు వద్ద రోడ్డుపై వరద పారుతుండడంతో వాహనాలు నిలిపివేసిన పోలీసులు (ఫైల్)

వనపర్తి రూరల్: అత్యాధునిక టెక్నాలజీలో ప్రజలకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని రైతులు, ప్రయాణికులు, వాహనదారుల వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. పల్లెపల్లెకు అనుసంధానంగా ఉండే ప్రధాన రహదారులపై వాగులు, వంకలపై హై లెవల్ బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాలు వచ్చినవంటే గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. వనపర్తి జిల్లాకేంద్రం నుంచి ఘనపురం మహబూబ్‌నగర్ వెళ్లే ఉద్యోగస్తులు, వాహనదారులు, ప్రయాణికులు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. అంకూరు గ్రామం దగ్గర లోలెవల్ వంతెన ఉండడంతో భారీ వర్షాలు వస్తే వంతెనపై నీళ్లు వచ్చి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఉద్యోగస్తులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వనపర్తి జిల్లా నుంచి పెద్దమందడి, ఎన్‌హెచ్ 44వరకు రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై నిత్యం వాహనదారులు, ప్రయాణికులు, వ్యవసాయ పొలంకు వెళ్లే రైతులు, పలు గ్రామాలకు పెద్దమందడి వెళ్తుంటారు. ఈ రహదారిపై వడ్డెగేరి గ్రామ సమీపంలో లో లెవల్ వంతెన ఉండంతో వర్షాలకు అమ్మచెరువు అలుగు నీరు వంతెనపైకి వస్తే పెదమందడి మండలానికి పలు గ్రామాలకు వెళ్లే ప్రజలకు, రైతులు, ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజనగరం గ్రామానికి వెళ్లాలంటే ఊరి చివర ఉన్న కల్వర్టు పైకి అమ్మ చెరువు అలుగునీరు రావడంతో గ్రామానికి రాకపోకలు బంద్ అవుతున్నాయని గ్రామ స్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పాలకులను నిలదీసినప్పుడే మాత్రమే కంటితుడుపు చర్యగా అధికారులకు ఆదేశాల జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఈ తంతు కొన్నేళ్లుగా కొనసాగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్న ఈ సమస్యలు తీరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చి వాగులు, పొంగి పొర్లితే ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారులపై హై లెవల్ వంతెనల నిర్మాణం చేపడితే ప్రజలకు, రైతులు, ప్రయాణికులకు, వాహనదారుల కళ్లలో ఆనందాన్ని, గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులకు అధిగమించవచ్చు.

వంతెన నిర్మించాలి

వనపర్తి నుంచి వడ్డేగేరి, అచ్యుతాపురం వర్షం కురిసిందటే వచ్చే వర్షపు నీరు, మురికినీరు రాజనగరం చెరువులోకి చేరి నిత్యం వంతెనపై మురికి నీరు పారడంతో పాకర చేసి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు.

– సిద్దార్థ, వనపర్తి పట్టణం

త్వరగా ప్రారంభించాలి

కొద్దిరోజుల క్రితం అంకూరు గ్రామం వద్ద ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హై లెవల్ వంతెనకు శంకుస్థాపన చేశారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కాబట్టి వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలి. నిర్మాణం పూర్తయితే వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చు.

– దామోదర్‌రెడ్డి అంకూరు గ్రామం



వాహనాలు నిలిపివేసిన పోలీసులు (ఫైల్)



రాజనగరం వడ్డెగేరి కల్వర్టుపై పారుతున్న నీరు

రేషన్‌డీలర్ల పెండింగ్ కమీషన్ అందించాలి



పాన్‌గల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు



అమరచింతలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న రేషన్‌డీలర్లు

పాన్‌గల్: పెండింగ్‌లో ఉన్న ఐదునెలల కమీషన్ మంజూరు చేయాలని, దుకాణాల్లో నిల్వఉన్న లావు బియ్యం తొలగించాలని మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. నెలకు రూ.30 వేలు గౌరవవేతనం ఇవ్వాలని, దుకాణాల్లో బియ్యం దించే హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలని, డీలర్లకు రూ.10లక్షల బీమాను వర్తింపజేయాలన్నారు. ఆయా డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తామని తహసీల్దార్ డీలర్లకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, బిచ్చన్న, రమేష్ పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: జిల్లాలోని గత ఏప్రిల్ నెల నుంచి ఐదు నెలలుగా కమీషన్ రావడం లేదని వెంటనే ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురాము కోరారు. సెప్టెంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌షాపుల బంద్‌కు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చామన్నారు. ఈ సందర్భంగా రేషన్‌డీలర్లతో కలిసి ,ఆయన సోమవారం డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలడీలర్ల సంఘం అధ్యక్షుడు నరేష్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, రాఘవేంద్ర, నరసింహారెడ్డి, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు సబ్సిడీ సరుకులను అందిస్తున్న డీలర్లకు ప్రభుత్వ పరంగా అందాల్సిన కమీషన్‌ను వెంటనే అందించాలని డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాములు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటేష్, ఆదాం, సూజాత, భక్తరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుమలి, రమేష్ పాల్గొన్నారు.



వనపర్తిలో డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్ల సంఘం

హైదరాబాద్‌కు తరలిన కిష్టాపూర్‌తండా గిరిజనులు

పాన్‌గల్: సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన రైతులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ.. పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జిల్లా కలెక్టర్‌కు, మంత్రి జూపల్లికి విన్నవించిన సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆయా రైతులతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన ఉండాలి

చిన్నంబావి: యువతకు డ్రగ్స్ ,గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలో డ్రగ్స్‌ను పసిగట్టే డాగ్ స్క్వాడ్‌తో వివిధ దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయవృత్తి ఓ వరం

మదనాపురం: ఉపాధ్యాయులు విధులు నిర్వహించడం భగవంతుడు ఇచ్చిన వరమని పీఆర్‌టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు బౌదారెడ్డి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం బాదాం లక్ష్మీనారాయణ గుప్తా సన్మాన పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫారుఖ్‌హుస్సేన్, కృష్ణయ్య, మద్దిలేటి, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టిగణపతిని పూజించి.. పర్యావరణాన్ని కాపాడుదాం



వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

కొత్తకోట రూరల్: ప్రతిఒక్కరూ మట్టి గణపతిని ప్రతిష్ఠించి, పర్యావరణాన్ని కాపాడాలని ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు భీమప్రసన్న లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా మహిళాసంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మంజులను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు భీమ ప్రభాకరశెట్టి, కొత్తకోట పట్టణ అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీటోర్నీలో సత్తాచాటిన మానాజీపేట టీం

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట గ్రామంలో సతీష్‌యాదవ్ స్మారకార్థం మానాజీపేట సైనిక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీనియర్స్ మానాజీ టీం సత్తా చాటి మొదటి బహుమతిని గెలుపొందారు. సోమవారం మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,116, రెండోస్థానంలో నిలిచిన షాపురం జట్టుకు రూ.5,116 నగదును అందించారు. కార్యక్రమంలో శ్రీనువాసులు, నరసింహ్మ, శ్రీను, సతీష్‌కుమార్, రాజ్‌కుమార్ చెప్పారు.

బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలి



మండల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ నాయకులు

కొత్తకోట రూరల్: బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ గౌనికాడి రాములుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొత్తకోటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కురుమూర్తియాదవ్, గంగాధర్, శేఖర్, జి.సంతోష్, భాస్కర్ ఇతర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ నిర్మించాలి..

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల వెనకాల శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి అక్కడే డైనింగ్‌హాల్ నిర్మించాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కురుమయ్య, బాలస్వామి, గట్టయ్య, మదన్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో టెండర్లకు ఆహ్వానం

వనపర్తిటౌన్: వనపర్తి డిపో పరిధిలోని వనపర్తి, పెబ్బేర్, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత బస్టాండ్‌లో ఖాళీ స్థలంలో వ్యాపారాలు నిర్వహించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని డీఎం వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాషింగ్, స్వీపింగ్, డీజిల్ టాప్‌అప్ పనులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన ద రఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. టెండర్ ఫారమ్‌లను డీఎం ఆఫీసులో పొందవచ్చనన్నారు. పూర్తి వివరాలకు 9494019474, 9959226289 నంబర్‌లకు సంప్రదించాలన్నారు.

దోమల నివారణకు సిబ్బంది చర్యలు తీసుకోవాలి

ఆత్మకూర్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నిత్యం ఫాగింగ్ చేపడుతున్నామని ప్రజలు పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. సోమవారం వార్డుల అధికారులు, కార్మికులతో కలసి 100 రోజుల ప్రణాలికలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. పట్టణంలో ఆయా కాలనీల్లో సిబ్బందిచే పారిశుద్ధ్య కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యూకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు పురపాలిక సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవార్డు ప్రదానం

వనపర్తి విద్యావిభాగం: గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్, పాండిచేరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్, నేషనల్ పీస్ యూనివర్సిటీ వారిచే సామాజిక సేవ – ప్రజల శ్రేయస్సు విభాగంలో ఇటీవల డాక్టరేట్ పొందిన సతీష్‌యాదవ్‌కు తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వారు విజయవాడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి అవార్డును ఆ సంస్థ సీఈఓ డాక్టర్ యువి రత్నం, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ధనాసి ఉషారాణి తదితర అందజేశారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉద్యమిస్తాం



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూర్: రైతులకు అడుగడుగునా అన్యాయం జరుగుతున్న ప్రశ్నించకుండా ఉండాలా ఇదేక్కడి దౌర్జన్యం అధికార కాంగ్రెస్ పార్టీని ఎండగడుతామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్, మాజీఎంపీపీ బంగారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. రైతులకు యూరియా విషయంలో అన్యాయం జరుగుతుందని తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే చిట్టెంరామ్మోహన్‌రెడ్డి నిలదీశారన్నారు. ఇది జీర్ణించుకులేని కాంగ్రెస్ నాయకులు తమ నాయకుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అర్హతలకు మించి విమర్శించడం సబబుకాదని దుయ్యబట్టారు. అర్హతకు మించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే సహించేది లేదని స్పష్టం చేశారు.

పీఏసీఎస్‌వద్ద నిరసన..

ఆత్మకూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు ఉదయం ఐదు గంటలనుంచి యూరియా కోసం నిరీక్షిస్తున్నారని, ప్రతిరోజూ పడరాని పాట్లు పడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ కార్యాలయంవద్ద రైతులతోకలసి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో చెన్నయ్య, మండ్లరామకృష్ణ, అంజి, మాసన్న, వేణు రెడ్డి, భీమన్న ఉన్నారు.

గోపాల్‌పేట: రైతులను గంటల తరబడి క్యూలైన్లలో పడిగాపులు కాసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సోమవారం పీఏసీఎస్‌లో యూరియాకోసం రైతులు గుంపులుగా వెళ్లడంతో తోపులాట జరిగింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వెంటనే ఎస్సై నరేష్‌కుమార్ పీఏసీఎస్ వద్దకు వెళ్లి లైన్లో నిలబెట్టి యూరియా పంపిణీ చేయించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్‌రాజు, మాజీ వైఎస్ ఎంపీపీ శేఖర్ నిలదీశారు. రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. ఏఓ కరుణశ్రీని వివరణ కోరగా బయట ప్రైవేట్ ఫర్టిలైజర్ సెంటర్ బంద్ ఉండటంతో ఇక్కడే ఎక్కువగా రైతులు వచ్చారన్నారు. ప్రస్తుతం సరిపడా యూరియా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమాధానమిచ్చారు.

సురవరం జీవితం స్ఫూర్తిదాయకం



ప్రతాపరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: వనపర్తికి సురవరం ప్రతాప్‌రెడ్డి ఓ వరమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రంలో ఆయన వర్ధంతి సందర్భంగా సురవరం విగ్రహానికి సాహితీకళావేదిక ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ పత్రిక ద్వారా విశేష కృషి చేసిన సురవరం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రాజారాంప్రకాశ్ ప్రతాపరెడ్డి వర్ధంతి, బీపీ మండల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి, జీహెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసరావు, సాహితీవేత్తలు చంద్రశేఖర్, న్యాయవాది ఉత్తరయ్య, గిరిరాజాచారి, దేవన్ననాయుడు, బాలస్వామి పాల్గొన్నారు.

నల్లచెరువుపై వాహనాల రాకపోకలు సాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో మున్సిపల్ అధికారులు నల్లచెరువుపై వాహనాల రాకపోకలు సాగించేలా చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటీ శ్రీధర్ కలెక్టర్ ఆదర్శ్‌సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ట్యాంక్‌బండ్ భారీ వాహనాలు వెళ్లడానికి మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి హయాంలో రోడ్డు వెడల్పు చేశారన్నారు. దీంతో భారీ ట్రాఫిక్‌తో గోపాల్‌పేట – ఘణపురం వెళ్లే రోడ్డుకు బైపాస్‌లో వెళ్లడానికి గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి రోడ్‌పై భారీ వాహనాలు వెళ్లరాదంటూ నల్లచెరువు అడ్డంగా గేట్లు ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచి మరమ్మతుకు భూమిపూజ చేశారన్నారు. గేట్ల నిర్మాణం కాకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారివెంట నాగన్నయాదవ్, కంచె రవి, ఉంగ్లం తిరుమల్ ఉన్నారు.

రైతులకు బోనస్ చెల్లించాలని బీజేపీ నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మదనాపురం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత రబీ సీజన్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు అమ్మిన సన్న వరి ధాన్యానికి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జేకే మోహన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో పనులు

ఆత్మకూర్: ఎంపీ నిధులతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కేపీటీ ప్రభుత్వ పాఠశాలలో రూ.35 లక్షల నిధులతో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ మంజూరుతో స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, అశోక్‌భూపాల్, తమ్మలి విజయ్, మనోహర్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాతో అభ్యసన సామర్థ్యాలు మెరుగు



ఖిల్లాఘనపురంలో మేళా కార్యకమ్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



పాన్‌గల్‌లో పరిశీలిస్తున్న ఎంఈఓ

పాన్‌గల్: టీఎల్‌ఎం మేళాతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడుతాయని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి టీఎల్‌ఎం మేళాను ఆయన జీహెచ్‌ఎంలతో కలిసి పరిశీలించారు. మండలస్థాయిలో ప్రదర్శించారన్నారు. మొత్తం వివిధ పాఠశాలల నుంచి 27 ప్రదర్శనాలు వచ్చాయని వాటిలో ఉత్తమంగా ఉన్న వాటిని జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు నాగలీల, విజయలక్ష్మి, ఆనంద్, జమీల్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడిలో సోమవారం బోధన–అభ్యసన ఉపకరణాల మేళా ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మంజులత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, విద్యాకమిటీ మాజీచైర్మన్ రవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శాంతన్న, ఎస్.వరప్రసాదరావు, బాణం విష్ణులతో కలిసి ప్రారంభించారు. మేళాలో 80 బోధన–అభ్యసన ఉపకరణాలు ప్రదర్శించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహాయ సహకారాలు అందించినట్టు ఎంఈఓ తెలిపారు.

ఖిల్లాఘనపురం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన అందించాలని తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ సునీత, ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పలు ప్రదర్శనలు చేశారు. హాజరైన అధికారులు మేళాలో ఏర్పాటు చేసిన బోధనాభ్యాసన సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చెన్నప్ప, మునావర్ సుల్తానా, కాళిదాసు పాల్గొన్నారు.



పెద్దమందడిలో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులత